తుఫాను కారణంగా గృహాలు దెబ్బతిన్న బాధితులకు బియ్యం పంపిణీ

తహసిల్దార్ రామకృష్ణ

విశాలాంధ్ర-చింతపల్లి : తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో దెబ్బతిన్న సుమారు 22 గృహాలకు సంబంధించి పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలను ఆదుకునే క్రమంలో తమ శాఖ ద్వారా బియ్యం పంపిణీ చేయడం జరిగిందని స్థానిక తహసిల్దార్ టీ రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలుచోట్ల పూరి గుడిసెలు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న గృహాలను గుర్తించి బాధితుల వివరాలు సేకరించడం జరిగిందని, ఆ వివరాలను జిల్లా కలెక్టర్ కు పంపించడం జరిగింది అన్నారు. ముందస్తుగా బాధితులకు బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ మొట్టడం కృష్ణమూర్తి, వీఆర్వో ఎస్ కృష్ణారావు, రెవిన్యూ సిబ్బంది ప్రసాద్ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలోని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సుడిగాలి పర్యటన మండలంలో చేపట్టిన వంతెనల నిర్మాణం పనులను డిసెంబర్ లోగా పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఆదేశించారు. గురువారం ముంచంగి పుట్టు మండలంలో మారుమూల లక్ష్మీపురం పంచాయితీలో పర్యటించి బిరిగుడ వంతెన పనులు, ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో లక్ష్మీపురం పంచాయతీ కర్లాపోదర్ గెడ్డ పై వంతెన నిర్మించనున్న ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టీ గొంది వంతెన నిర్మాణానికి రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. నిర్మాణం పనులు పటిష్టమైన నాణ్యతలో పాటించాలని ఆదేశించారు. అనంతరం లబ్బూరు గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాల, ముంచంగిపుట్లో బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు. ఆ తర్వాత మండల కేంద్రంలో అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాలను సక్రంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ కుమార్ తాహాసిల్దార్ రాఫిజాన్ గిరిజన సంక్షేమ శాఖ ఏఈ జబ్బర్, పంచాయతీరాజ్ ఏఈ మురళి, పి ఐ యు ఏ ఈ వినిల్, డిప్యూటీ తాసిల్దార్ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలి

అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు డిమాండ్

విశాలాంధ్ర-అనంతగిరి : గురువారం అనంతగిరి పి.హెచ్.సిని తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు డాక్టర్ జ్ఞానేశ్వరి, డాక్టర్.జాహ్నవి లతో మాట్లాడుతూ పి.హెచ్.సి సమస్యల అడిగి తెలుసుకున్నారు. మంచినీరు సౌకర్యం సరిగా లేదని కరెంట్ కేటగిరి-1 ఉండడం వల్ల లోవోల్టేజ్ వస్తుందని కరెంట్ లేనపుడు జనరేటర్ కూడా లేదని వైద్యులు తెలిపారు. ఎంపి.హెచ్. డబ్ల్యు (ఎం) పోస్టు ఖాళీగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడుతూ అనంతగిరి పి.హెచ్.సి.లో నెలకు 2000 వేలకు పైబడి రోగులు పి.హెచ్.సి కేంద్రంలో వైద్యం పొందుతున్నారు.గర్భిణిలు డెలివరి సమయంలో కరెంట్ లేక పోతే జనరేటర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతగిరి పి.హెచ్.సి తో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అన్ని పి.హెచ్.సి లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా వైద్య సిబ్బంది ఉండాలంటే క్వార్టర్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 27న కౌన్సిలింగ్‌కు హాజరుకండి

ఐటిఐ ప్రిన్సిపాల్ రాజారావు

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ ఐటిఐ లో చేరుటకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెండవ విడత కౌన్సెలింగ్ ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ రాజారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుని వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 27న ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలనీ, మరిన్ని వివరాలకు 9866108604, 9494377833 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పంట నష్టాన్ని జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలన

విశాలాంధ్ర-డుంబ్రిగూడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో వాటిల్లిన పంట నష్టాలను జిల్లా వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు గురువారం పలుపు ప్రాంతంలో పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి నందు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేషకుమార్ మండలంలో గురువారం పర్యటించారు. తూటంగి, లైగండ, అరమ పంచాయతీల్లో సందర్శించి వరి, మొక్కజొన్న, వేరుసెనగ, అల్లం, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 41ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, వర్షాలు తగ్గుముఖం పడితేనే పూర్తిస్థాయిలో పంట నష్టాలను అంచన వేయగలమని వారన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రస్తుత వర్ష ప్రభావం తీవ్రంగా ఉందని గిరి రైతులు వరి పంట నాట్లు వేయవద్దని, వర్షాలు తగ్గుముఖం పడితే వరినాట్లు వేసుకోవాలని వారు గిరిజన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని నీలవేణి, మండల ఉద్యానవన శాఖ అధికారిని శిరీష, సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా అక్రమ లాడ్జి నిర్మాణం

- మామూళ్ల మత్తులో అధికారులు
- మండిపడుతున్న గిరిజనం

విశాలాంధ్ర-అరకులోయ : అరకులోయ పట్టణంలోని కాఫీ బోర్డు కార్యాలయానికి సమీపంలో టీటీడీ కల్యాణ మండపం సమీపంలోనీ దగ్గరలో అనుమతులు లేని అక్రమ లాడ్జి నిర్మాణం జోరుగా సాగుతోంది. పట్టణంలో గృహాన్ని నిర్మించాలంటేనే పంచాయితీ రెవెన్యూ అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలి.అలాగే భవనం నిర్మించే స్థలం పట్టా భూమా ప్రభుత్వానికి చెందినదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆస్తులకు సంబంధించినదా తెలుసుకోవాల్సిన బాధ్యత పంచాయితీ రెవెన్యూ అధికారుల పైన ఉంటుంది.అయితే ఇవి ఏమి లేకుండా అనుమతులు రాకుండా ఇష్టరాజ్యంగా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఓ మహిళ దర్జాగా అక్రమ లాడ్జి నిర్మాణం చేపడుతున్న అధికారులు ఎందుకు పట్టించుకోకుండా మౌనంగా ఉండి పోతున్నారని గిరిజన సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా చుట్టూ పక్కల సమీపంలో నివాస గృహాల మధ్య జి ప్లస్ త్రీ లాడ్జి నిర్మాణం చేపడుతున్న పంచాయతీ రెవిన్యూ అధికారులు పట్టి పట్టనట్లు చూసి చూడనట్లు ఉండిపోవడం వెనక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.లాడ్జి నిర్మాణం చేపడుతున్న ఆరోగ్యశాఖకు చెందిన మహిళ ఉద్యోగి వద్ద పంచాయతీ రెవెన్యూ అధికారులు భారీ స్థాయిలో హామ్య ఆమ్యాలు స్వీకరించారని ఆరోపణలు కూడా ఇక్కడ వెల్లువెత్తుతున్నాయి.ఈ కారణం వల్లనే ఊరు మధ్యలో నివాస గృహాలు పాఠశాలకు సమీపంలో జీప్లస్ త్రీ భారీ లాడ్జి నిర్మాణం జరుగుతున్న ఇంతవరకు ఎటువంటి నోటీసులు కూడా జారీ చేయకపోవడం తీవ్ర విచారకరమని గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు అంటున్నారు. తమ స్వలాభం కోసం కొంతమంది పంచాయితీ రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై లంచాలు స్వీకరించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని ఇక్కడ పలువురు చర్చించుకుంటున్నారు.లాడ్జి నిర్మాణం చేపడితే పంచాయతీకి పన్నుల రూపంలో ఆదాయం వస్తుందని అలాకాకుండా అక్రమంగా నిర్మించడం వలన పంచాయితీ అధికారులు పన్నులు వసూలు చేయలేరని ఇక్కడ గిరిజన సంఘాల నేతలు చెప్పుకుంటున్నారు. పాఠశాల సమీపంలో జనావాసాల మధ్య లాడ్జి నిర్మాణం జరుగుతుండడం వలన ప్రశాంతంగా ఆ పరిసర ప్రాంతాల్లో నివాసస్తులు తిరిగే అవకాశం లేదని పాఠశాల విద్యార్థినులు కూడా ఏ అత్యావసారనికైనా బయటకు వచ్చే అవకాశం ఉండదని అటువంటిప్పుడు ఏ విధంగా లాడ్జి నిర్మాణం జరుగుతున్న చూస్తూ ఊరుకుంటారని ఆ ప్రాంత నివాసస్తులు అడుగుతున్నారు. .ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, డిఎల్ పి ఓ స్పందించి జనా ఆవాసాల మధ్య బాలికల ఆశ్రమ పాఠశాల సమీపంలో అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ జి ప్లస్ త్రీ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని, అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్న పంచాయితీ రెవెన్యూ అధికారులపై విచారణ జరిపించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు గిరిజనులు గిరిజన సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో అక్రమ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఆందోళన కార్యక్రమం చేపట్టవలసి ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు.

దీనికి స్పందించిన ఎంపీడీవో వెంకటేష్ జి ప్లస్ త్రీ లాడ్జి నిర్మాణంపై పంచాయతీరాజ్ యాక్ట్ చట్టం ప్రకారం పంచాయతీ కార్యాలయం అధికారులు అనుమతులు ఇచ్చారో లేదో ప్లాన్ అప్రూవల్ పరిస్థితి ఏమిటో మిగతా ముఖ్య విషయాలు గురించి పంచాయతీ కార్యదర్శి వారి నుండి నివేదిక రాగానే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

వరద ముంపు గ్రామాల్లో సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పర్యటన

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్ ఐఏఎస్ వరద ముంపు గ్రామాలలో గురువారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలోని సున్నంవారిగూడెం, కన్నాయిగూడెం, చింత రేగుపల్లి, చిన్నమట్టపల్లి, గుండుగూడెం, తృప్తివారి గూడెం, అడవి వెంకన్నగూడెం, రామవరం గ్రామాలను/ పునరావాస కేంద్రాలను సందర్శించి, వరద బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలును అడిగితెలుసు కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు కిరోసిన్ టార్పాలిన్లు , నిత్యవసరాలు అందించాలని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ మౌలానా పాజిల్, సిఐ,కూనవరం ఎస్సై, ఎంపీపీ, ఎస్‌డిఆర్ ఎఫ్ బృందం, వీఆర్వోలు పంచాయతీ సెక్రెటరీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి : ఐసీడీఎస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ సూర్యలక్ష్మి

విశాలాంధ్ర-హుకుంపేట: నేటి సమాజంలో ఆడపిల్లలు ఆత్మవిశ్వాసం పెంచుకోని అన్ని విషయాల్లో ధైర్యంగా విజయాలు సాధించాలని ఐసీడీఎస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ సూర్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్ర మం, బేటీ బచావో- భేటీ పడవో నిర్వహించారు. అనంతరం ఐసీడీ ఎస్ కార్యాల యంలో గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడ పిల్లలపై జరుగుతున్న అగత్యాలను ఏవిధంగా ధైర్యంగా ఎదుర్కొవలో తెలుసుకోవాలని అదేశించారు. నేడు ప్రతి ఒకరి వద్ద పోన్ ఉన్నాయని వాటితో తమను 'తాము ఎలా రక్షించుకోవాలో హెల్ప్ లైన్ నెంబర్లు. వినియో గించుకోవాల ని సూచించారు. గ్రామాల్లో బాల్యవి వాహలపై అవగాహనలు కల్పించాల ని తల్లిదుండ్రులకు అర్థమయ్యే విధంగా విద్యార్థినులు వివరించా లని అప్పుడు బాల్యవివాహలు తగ్గుతాయని తెలిపారు. ఈకార్యక్ర మంలో ఐసీడీఎస్ సిడి పీవో బాలచంద్ర మణిదేవి ఎస్ ఐ సతీష్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మనవుడి వెంటే... మృత్యుఒడికి

- మనవుడి మరణాన్ని జీర్ణించుకోలేక తాత ఆత్మహత్య....
- కీడవాయిలో విషాధచాయలు..
- 48 గంటల వ్యవధిలో ఒకే ఇంట్లో రెండు మరణాలు
- ఆరుకు చేరిన గిరిజన విద్యార్థుల మరణాలు

విశాలాంధ్ర-కురుపాం : అల్లారముద్దుగా పెంచుకున్న మనవడి మరణం జీర్ణించుకోలేక తాత ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక సంఘటన మండలంలోని తిత్తిరి పంచాయతీ కీడవాయి గిరిజన గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న బిడ్డిక ప్రుధ్వీ(8)కి తీవ్రంగా జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఇంటికి తీసుకుని వెళ్లి వైద్యం చేయించే ప్రయత్నం చేశారు. వైద్యం పొందుతూ ప్రుధ్వీ బుధవారం ఉదయం ఇంటి వద్ద మృత్యుఒడిని చేరాడు. మృతదేహాన్ని స్మశానవాటిక తరలించిన సమయంలో వరసకు చిన్న తాత అయిన బిడ్డిక బాపన్న (60) ఇంట్లో ఉన్న పత్తి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వైద్యం కోసం మొండెంఖల్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్ళారు. చికిత్స పొందుతూ బాపన్న మృతిచెందాడు. భద్రగిరిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కీడవాయిలో విషాదచాయలు: ఒకే ఇంటిలో 48గంటల వ్యవధిలో ఇద్దరు మృతిచెందడంతో ఆ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. ఆత్మహత్య చేసుకున్న బాపన్నను హుటాహుటిన ఆసుపత్రికి తరలించినా ఫలితం దక్కలేదు. బాపన్న హిజ్రా కావడంతో తన అన్న కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా బావిస్తూ సాకేవాడు. అన్న పిల్లలను తన సొంత పిల్లలుగా బావిస్తూ వారందరిని కంటికి రెప్పలా చూసుకునేవాడు. తాత బాపన్న.మనవడు పృథ్వి ల మధ్య తాతా మనవడు బంధం ప్రేమానురాగాలు తో ఉండేది. గత కొన్నిరోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ ప్రుధ్వీ ను ధర్మలక్షీపురం పాఠశాల నుంచి కీడవాయి గ్రామంలో తన ఇంటికి తీసుకుని వచ్చి వైద్యం చేయించడం లో బాపన్న దగ్గరుండి చూసుకున్నారు. మనవడు మృతి చెందగా మరింత కుంగి పోయిన బాపన్న ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకే కుటుంబానికి చెందిన మనవడు పృథ్వి.తాత మనవళ్ల మరనాలతో కీడవాయి గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

స్త్రీలకు రక్షణ కల్పించే చట్టాలను అమలుపరచాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/మక్కువ : స్త్రీలకు రక్షణ కల్పించే చట్టాలను అమలు పరచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి రవికుమార్ అన్నారు. మక్కువలో విద్యార్థులతో మానవహారం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రఘుకుమార్ మాట్లాడుతూ చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ల వరకు స్త్రీలపై యాసిడ్ దాడులు అత్యాచారాలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మద్యం మరియు డ్రగ్స్ లాంటివి పూర్తిస్థాయిలో నిర్మూలించకపోవడం వలన దాడులు జరుగుతున్నాయి అన్నారు.రాష్ట్రంలో మహిళలకు కనీసం రక్షణ లేదని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో రాష్ట్రంలో దాడులు మరింత ఎక్కువ అయ్యాయని ఆయన అన్నారు ఈ దాడులు కు కారణం ప్రధానంగా మహిళలు వేసుకున్న బట్టలు అని చెప్పిన ఈ సమాజం మరి రాంబద్రపురంలో ఆరు నెలల పసికందు ఏ విధమైన బట్టలు వేసుకుందని, ఏ విధంగా లైంగిక దాడికి ప్రోత్సహించింది అని ప్రశ్నించారు దాడులకు విరివిడిగా లభ్యం అవుతున్న గంజాయి డ్రగ్స్ కారణమని వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలో 9 ఏళ్ల అమ్మాయిని రేప్ చేసి చంపేసిన బాలురు చూసిన సైట్లను వెంటనే తొలగించాలన్నారు. ఇలా జరిగిన ఎంతోమంది బాధితులను ప్రభుత్వం ఆదుకునీ అత్యాచారాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కాగితాలకే పరిమితమైన దిశ నిర్భయ స్పెక్స్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా కన్వీనర్ హరికృష్ణ మండల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులు అరెస్ట్

విశాలాంధ్ర-పాచిపెంట : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వేరువేరు రాష్ట్రాలకు చెందిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పాచిపెంట ఎస్సై పొదిలాపు నారాయణరావు తెలిపారు. పాచిపెంట పోలీస్ కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు గురువారం మండలంలోని పీ. కొనవలస చెక్ పోస్టు దగ్గర వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 3.5 కేజీ లు గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి ముద్దాయిలను రిమాండ్ కు తరలించామని, సాలూరు రూరల్ సీఐ గేదెల బాలకృష్ణ కేసును దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ వివరాలు వెల్లడించారు.

విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదు : మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు : గిరిజన సంక్షేమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. గురువారం సచివాలయంలోని ఆమె ఛాంబర్‌లో విజయనగరం, పల్నాడు, గుంటూరు జిల్లాల ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ వసతి గృహాలు, పాఠశాలలలో వసతి, భోజన సౌకర్యాలు, సురక్షిత తాగునీరుతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు.సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

వ్యాపార నైపుణ్యాలు పెంచుకొని ఉపాధి అవకాశాలు పొందండి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : వ్యాపార నైపుణ్యాలు పెంచుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. నైపుణ్యాలతో అద్భుతమైన అవకాశాలు వస్తాయని, పలువురికి ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆశాదీపాలుగా నిలవగలరన్నారు. పార్వతీపురం ఐటిడిఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల సంస్థ, నాబార్డు తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు., ఇతర రంగాలను విభజించి వాటి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్హత, వనరులు ఉన్న అభ్యర్థులకు రుణాల మంజూరులో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ స్వంత కాళ్ళ మీద నిలబడాలి అనేది లక్ష్యం అన్నారు. అవసరమైన శిక్షణ ఇచ్చుటకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగితే పలువురికి ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. ఒత్సాహికుల నుండి ప్రతినెల దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన చెప్పారు. వ్యాపార నైపుణ్యాలు పెంచుకోవాలని ఆయన సూచించారు. కోటి రూపాయలు వరకు రుణాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు సాయి కుమార్, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ దినేష్ కుమార్ రెడ్డి, ఎస్ బి ఐ రీజనల్ మేనేజర్ బిబి సాహు, ఖాదీ పరిశ్రమల బోర్డు అభివృద్ధి అధికారి రవి కుమార్ , ఔత్సాహికులు పాల్గొన్నారు.

ఇది చెరువు కాదు... గ్రామంలోని ప్రధాన రోడ్డు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గెడ్డలుప్పి-కొత్తవలస గ్రామాల మధ్య రహదారి చాలా అధ్వానంగా ఉంది. చెరువులను తల పిస్తుంది. గ్రామంలో నిత్యవసర వస్తువులు కొనుక్కోవడానికి వెళ్లాలన్న చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని గ్రామస్తులు తెలియ జేశారు. నడిచి వెళ్లాలన్న వాహనంపై వెళ్లాలన్న కష్టంతో కూడుకున్న ఉన్నదన్నారు. దీనిపై అధికారులు స్పందించి కనీసం నడిచి వెళ్లేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-పాలకొండ : పాలకొండ నగర పంచాయతీ పరిధి మెయిన్ రోడ్ లో కమిషనర్ సర్వేశ్వరరావు పర్యవేక్షణలో ప్రధాన కాలువలలో జంగిల్ క్లియరెన్స్ పూడిక తీతలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు వర్షాకాలం కావడంతో పట్టణ పరిధిలో 20 వార్డులలో ను పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ నిలుపుదల

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలో రేపు అనగా శుక్రవారం 33/11కెవి సబ్ స్టేషన్ లో పవర్ ట్రాన్స్ఫార్మర్ మైంటెనెన్ వర్క్ అండ్ ట్రీ కట్టింగ్ పనులు ఉన్నందున మండలం మొత్తం విద్యుత్ అంతరాయం ఉదయం 9గం.ల నుండి సా॥ 3 గం.ల వరకు విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందని, ప్రజలంతా తెలుసుకొని సహక రించాలని, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణ మూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చక్రవర్తి, సబ్ ఇంజనీర్ జీ.నీలిమ తెలిపారు.

దళితులను పారిశ్రామికవేత్తలుగా చేసే ఆలోచన చేయండి

శాసనసభలో ఎమ్మెల్యే విజయ్‌చంద్ర



విశాలాంధ్ర-పార్వతీపురం : రాష్ట్రంలోని వందమంది దళితులను ఎంపికచేసి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్ది, వారిని పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తే వారి ఆధ్వర్యంలో వేలాదిమంది ఎస్సీలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఎక్కువ అవకాశాలున్నాయని పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర తెలిపారు. గురువారంనాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగముగా ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎంతోమంది ఎస్సీ సామాజికవర్గం నుంచి మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, అధికారులుగా పనిచేసిన ఎస్సీ సామాజిక వర్గంలో ఎదుగుదల కనిపించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్లో, భారతదేశంలో దళితుల సంఖ్య ఎక్కువగాఉన్నప్పటికీ, వారికి తగిన సంక్షేమ పథకాలు లేక, ప్రాధాన్యత లేక ఆర్థికఅభివృద్ధి జరగడంలేదన్నారు. వారిబ్రతుకులు అలానే ఉంటున్నాయని తెలిపారు. మరో శాసనసభ్యులు రామాంజనేయులు కూడా సభలో దళితుల సమస్యలను తెలియజేశారని దళితుల బ్రతుకులు ఎందుకు మారకూడదన్న ఆలోచనని ప్రభుత్వం చేయాలని విజ్ఞప్తి చేశారు.మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్లో వారికి తగ్గకార్యక్రమాలు రూపొందించాలని కోరారు. గతంలో ఎస్సీలకు సంబంధించిన ఏమైనా చేసారా... చేస్తే సభద్వారా తెలియచేయాలని మంత్రిని కోరారు.గత ప్రభుత్వహయాంలో ఎస్సీలకు నిధులు కూడా మంజూరు కాలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో దళితులకు సంబంధించి మంచి ఆలోచన చేయాలని తన విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు. ఎస్సీయువతకు మన ప్రభుత్వం హయాంలో మంచి చేసి చూపించలేమా అనిమాట్లాడిఅసెంబ్లీలో అందరినీ ఆకట్టుకున్నారు. ఇదిలాఉండగా అధ్యక్షా...అని అనడానికి ఎన్నోరోజులుగా తాను ఎదురుచూస్తున్నానని, నేడు అటువంటి అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని ముందుగా స్పీకర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. శాసనసభకు మొదటిసారిగా ఎన్నికైన విజయ్ చంద్ర శాసనసభలో మొదటి ప్రశ్నను గురువారం వేయడంతో టిడిపి బిజెపి జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బాలికలకు అవగాహన

విశాలాంధ్ర-వీరఘట్టం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం కిషోర్ బాలికలకు ఐసిడిఎస్ పిఓ. బి.సిమ్మాలమ్మ అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలలోపు వివాహం చేసుకోకూడదని, ఆడపిల్లలు చక్కగా చదువుకోవాలి, చెడు వాటికి ప్రోత్సహించకూడదు వంటి అంశాలపైన అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేవీ నాగమణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎన్ రాజేశ్వరి, జే జ్ఞానమ్మ,అంగన్వాడి కార్యకర్తలు,ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు, పాల్గొన్నారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

- శనివారం సి.ఎంకు వినతిపత్రాన్ని అందజేయనున్న రాష్ట్ర ప్రతినిధి బృందం
- తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలని సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనరస ప్రభుత్వానికి విజ్ఞప్తి

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలం, గెమ్మిలి పంచాయతీ, మద్దుల బంద గ్రామాల్లో తుపాన్ బాధిత రైతుల వ్యవసాయ భూమి లను సి.పి ఎం పార్టీ ప్రతినిధి బృందం పర్యటన నిర్వహించింది. మద్దుల బంధ గ్రామాల్లో సుమారు 20 ఎకరాల భూముల్లో తుపాన్ ప్రభావం వల్ల నష్టపోయింది. వరి నాట్లు వరదలకు కొట్టుకొని పోయింది. మరి కొన్ని పొలాల్లలో వరి పంటల్లో ఇసుక, మట్టి మేట వేసింది. వరద ఉధృతి పెరిగింది. తుపాన్ ప్రభావం ఉన్న గ్రామాల్లో కనీసం అధికార యంత్రంగా పర్యటన కూడ నిర్వహించలేదు.

జిల్లా ప్రతినిధి బృందంలో జిల్లా కార్యదర్శి పి అప్పల నరస తో పాటు జి.మాడుగుల మండల కార్యదర్శి ఎస్.ధర్మాన పడల్, నాయకులు చిన్నారావు, వరహాల బాబు, విరాన్న పడాల్ తదితరులు పాల్గొన్నారు. సి.ఎంకి సి.పి ఎం పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని శనివారం అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా తుపాన్ ప్రభావం వల్ల నష్ట పోయినా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, వారిని ఆదుకోవాలని సిపి ఎం పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి వినతి పత్రాన్ని అందజేస్తారు. పోలవరం ముంపు ప్రాంతాలతో పాటూ జిల్లా పరిదిల్లో వరద ఉధృతి వల్ల భూమి నష్టం, ఇల్లు ధ్వంసం, కల్వర్టు డెమేజ్, వంతెన నిర్మాణం మొదలగు సమస్యలను గుర్తించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల భూములాల్లో రైతులు నష్టపోయారు.

ఆశ్రమ పాఠశాలల్లో హెచ్‌ఎంల, నియంత ధోరణి

విశాలాంధ్ర-మారేడుమిల్లి : గతపదిరోజులుగా కురుస్తున్న వర్షాలతో మారెడుమిల్లి మండలం లో కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తూ రహదారులకు అడ్డంగా పెదపెద చెట్లుపడి, ఎక్కడికక్కడరాక పోకలకు అంతరాయం ఏర్పడడంతో జిల్లా కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోగ్య రీత్యా ఈ నెల 19 వ తేదీ నుండీ 25వ తేదీ వరకూ ఏ రోజుకారోజు అలెర్ట్ ప్రకటిస్తూ పాఠశాలలకుసెలవులు ఇవ్వడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాల యాజమాన్యాలు సెలవులు ప్రకటించిన.మారేడుమిల్లి మండలం లో ఉన్న ఆశ్రమ పాఠశాలలల్లో 6రోజులు సెలవుదినాలను ఏచ్ ఎం లు అమలు చేయలేదు. దీని వలన ఎంతో మంది ఉపాధ్యాయులు వర్షాలకు తడుచుకుంటూ పాఠశాలకు వెళ్లి రావడం వల్ల ఇబ్బంది పడుతూ కష్టాలను ఎదుర్కొంటున్నారు. దేవుడు వరమిస్తే పూజారి తిరస్కరించినట్టుఉంది. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితి. స్వాతంత్రం వచ్చి ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగిస్తున్న అత్యుత్తమ జిల్లా కలెక్టర్ తుఫాను సెలవులు ఇచ్చిన. ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంలు నియంతన ధోరణిలో పాఠశాలలను నడిపిస్తూ ఉపాధ్యాయులను తీవ్ర మనోవేదనకు కురిచేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రెసిడెంట్ ఎం. మంగిరెడ్డి, స్టేట్ కౌన్సిలర్ పి బాల్ రెడ్డి పత్రికా ప్రకటన లో తెలిపారు.

ఎన్నికలు హామీలు అమలు జరపాలి : ఏపిటీఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-కురుపాం : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తూచ తప్పక అమలు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బంకులు జోగి నాయుడు డిమాండ్ చేశారు.గురువారం కురుపాం లో ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 117 రద్దు, రాష్ట్ర సిలబస్ తెలుగు లోనే బోధన, అమ్మ కి వందనం 2024డిఎస్సీ ఆలస్యం అవుతుందని తాత్కాలిక సబ్జెక్టు వాలంటీర్ల నియామకం కోసం డిమాండ్ చేశారు.పిఎస్ సుబ్బారావు,వల్లా మోహన్, దుర్గా రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల సర్వే నిరంతరం జరగాలి... ప్రతి వ్యక్తిని పరీక్షించాల్సిందే : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఒక గ్రామంలో జ్వరం కేసు నమోదు అయితే ఆ గ్రామంలో ప్రతి వ్యక్తినీ పరీక్షించాల్సిందే అని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.ప్రతి కేసును క్షుణ్ణంగా విచారణ చేయాలని ఆయన ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా

కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కడా నమోదు కాకుండా శత శాతం చర్యలు చేపట్టాలన్నారు. అనుమానాస్పద కేసులు ఉన్నా అన్ని పరీక్షలు చేసి మంచి వైద్యాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. వైద్య అధికారులు తమ క్షేత్ర స్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ పక్కాగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సీతంపేట, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాల్లో మరింత శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. జ్వరాల సర్వే నిరంతరం సాగాలని, మందులు సిద్ధంగా ఉండాలని ఆయన చెప్పారు. పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఒక్క మరణం కూడా సంభవించరాదని ఆయన అన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆయన అన్నారు. ప్రస్తుత సీజన్ లో వైద్య అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. సిబ్బంది సేవలను ప్రణాళికాబద్ధంగా పక్కాగా వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. అవసరం మేరకు మైదాన ప్రాంతాల నుంచి గిరిజన ప్రాంతాలకు సిబ్బందిని డిప్యూట్ చేయాలని ఆదేశించారు. కీటకాల (వెక్టార్) ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ పార్వతి, జిల్లా మలేరియా అధికారి వై మణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నారాయణ రావు, డిప్యూటీ డిఎంహెచ్ ఓ శివ కుమార్, ప్రోగ్రాం అధికారులు ఎం వినోద్, టి జగన్మోహన రావు, వైద్య అధికారులు, పి హెచ్ సి వైద్యులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

వైయస్సార్సీపి రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రెటరీ కూడా సురేష్‌కుమార్

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన ప్రాంతంలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి, విద్యార్థిను ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆశ్రమ పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని వైయస్సార్సీపి రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రెటరీ కూడా సురేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాల్లో సరైన వసతులు ఉన్నాయా లేవా అనేదానిపై ప్రధానోపాధ్యాయులు వార్డెన్ క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, అనేక పాఠశాలలో విద్యుత్ సదుపాయం సరిగా లేక నానా అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం అందిస్తున్న మెనూ సక్రమంగా నిర్వహించడం లేదని, మరిగించిన మంచినీరు విద్యార్థిని విద్యార్థులకు అందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు నివాసం ఉంటున్న భవనాలు శిధిలావస్థలో అనేక చోట్ల ఉన్నాయని డి,డి, ఏ టి డబ్ల్యూ లు ఇందుకు పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణమని వారన్నారు. వాతావరణం మార్పుల వల్ల విద్యార్థుల జ్వరాలు సీజనల్ వ్యాధులు శర్మ వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని ఆశ్రమ పాఠశాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి విద్యార్థి విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు.

నాంద్రగండలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-కురుపాం : రోగాలకు అతీతమైన వర్షాకాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మొండెం ఖల్ వైద్యులు డాక్టర్ ప్రజ్ఞ సూచించారు.గురువారం మండలం లోని జి. శివడ పంచాయతీ నాంద్ర గండలో మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని బి.ప్రజ్ఞ వైద్య శిబిరం నిర్వహించారు, ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞా మాట్లాడుతూ జ్వరాల సిజన్ కావడం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టుచెప్పారు. అనుమానం ఉన్న రోగులకు రక్త పరీక్షలు,వ్యక్తిగత శుభ్రత,పరిసరాల పరిశుభ్రతపై అవగాహనా కల్పించారు.ఒక రోజు కు మించిన జ్వరం ఉంటే సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నకు వెళ్లి రక్త పరీక్ష చేయించుకుని అవసరమైన వైద్య సేవలు పొందాలని సూచించారు.

సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-ఎటపాక : గన్నవరం పంచాయితీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం స్థానిక సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ (శైలజ) ఆధ్వర్యంలో దగ్గర ఉండి ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరీ వరదలు దృష్ట్యా, వాతావరణ మార్పులు, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం క్షీణించి, దోమలు విజృంభించి సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని, ముందస్తు చర్యల్లో భాగంగా మురుగు నీటి కాలువలను, ప్రధాన వీధులను శుభ్ర పరిచారు. గ్రామంలో కాలువలు శుభ్రపరిచిన అనంతరం కాలువలలో , నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ ను చల్లి దోమలు వ్యాప్తి చెందకుండా అరికడుతున్నారు. అనంతరం ప్రధాన వీధులలో హైపో ద్రావణాన్ని పిచికారి చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఉప సర్పంచ్,మాట్లాడుతూ ప్రజలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం అందజేసిన తడి చెత్త మరియు పొడి చెత్త డస్ట్ బిన్ లను వాడి పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి : కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: విద్యార్థి దశ నుండే ఆసక్తిగల రంగాల్లో లక్ష్యాన్ని ఏర్పరచుకొని బంగారు భవితకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. శిక్షా సప్తా విద్యా వారోత్సవాల వేడుకల్లో భాగంగా నాల్గవ రోజు స్థానిక ప్రభుత్వ బాలికొన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని అన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, లలిత కళలు వంటి రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్దుల్లో స్ఫూర్తిని నింపారు. ఆరోగ్యం కోసం మంచి ఆహార అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించు కోవాలని అన్నారు.రక్త హీనత లోపం తలెత్తకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన ప్రార్థనా గీతాలు, నాడు-నేడు నాటిక, సామూహిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శిక్షా సప్తా విద్యా వారోత్సవాల వేడుక నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాధికారి జి.వగడాలమ్మ, ఎమ్ ఈ ఓ కె.ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పీవీ.ప్రసాద్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు, బడి తోటలు నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు బడితోటలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల బోధనా ప్రమాణాలతో ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలన్నారు. రక్తహీనత నివారణ పట్ల దృష్టి సారించి పాఠశాలస్థాయి నుండి పర్యవేక్షణ చేసి విద్యార్థుల ఆహార అలవాట్లలో మార్పులు తీసుకురావాలని ఆదేశించారు. ప్రతిపాఠశాలలో బడి తోటలు (కిచెన్ గార్డెన్) నిర్వహించి ఆకుకూరలు, క్యారెట్, బీట్ రూట్, చిక్కుడు వంటి పోషకాహారాలను పండించి మధ్యాహ్న భోజనపథకంలో వినియోగించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని, తాగునీరు పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. తాగునీటి ట్యాంకు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని అన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, రన్నింగ్ వాటర్ ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, అవసరమైతే చెత్త బుట్టలు పెట్టాలని ఆయన సూచించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల ఆరోగ్యానికి హాని చేసే తినుబండారాలు పట్ల దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు. పిల్లల్లో మంచి ఆహారపు అలవాట్లు వచ్చినపుడు ఆరోగ్యం బాగుంటుందని తద్వారా విద్యపైదృష్టి సారించగలరన్నారు. విద్యా బోధన పక్కాగా ఉండాలని, విద్యార్థుల ప్రమాణాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయడమే కాకుండా నోట్ పుస్తకాలు, వర్క్ బుక్ లు ఉపాధ్యాయులు పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవాటు చేయాలని, సైన్స్ ఎగ్జిబిషన్ లు తరచూ నిర్వహించాలన్నారు. విద్యతో పాటు క్రీడలలో ప్రోత్సహించాలని ఆదేశించారు. మండలాల్లో ఏ క్రీడలలో ఎక్కువ ఆసక్తి ఉన్నది గుర్తించి అటువంటి వాటిలో ప్రోత్సహించడం వలన సహజ నైపుణ్యంతో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరు సూచించారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి గార వగడాలమ్మ, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, కేజీబివి ప్రత్యేకఅధికారులు పాల్గొన్నారు.

సేఫ్టీ డ్రైవింగ్‌పై వాహనదారులకు అవగాహన తప్పనిసరి

ఎంవిఐ సత్యనారాయణ

విశాలాంధ్ర-కురుపాం: వాహనదారులందరికీ సేఫ్టీ డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన తప్పనిసరి అని పార్వతీ పురం ఎఎంవిఐ సత్యనారాయణ సూచించారు. గురువారం కురుపాం మండలం పి.లేవిడి జంక్షన్ వద్ద అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ మరియు ఆర్టీసీ సూపరెండెంట్ వై .ప్రభాకర్ రావు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ ఎస్.ఎం.రాజు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వెహికల్ చట్టం ప్రకారం పాటించాల్సిన నియమాలు వాహనదారులు కు తెలిపారు. వాహనాలు పరిమితికి మించి జనాభా ఎక్కించుకొని నడుపు రాదని స్పష్టం చేశారు. ధృవీకరణ పత్రాలు పరిశీలించిన తర్వాత అపరాధ రుసుం విధించారు.డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వీలైనంత త్వరగా లైసెన్స్ చేయించుకోవాలని ఆదేశించారు.

తప్పిన పెను ప్రమాదం

డ్రైవర్, క్లీనర్ లకు గాయాలు

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం సమీపంలో మూలిగూడ జంక్షన్ వద్ద ప్రధాన రహదారి పై ఉన్న 11కెవి విద్యుత్ వైర్లు జీడి పిక్కలు తో వెళ్తున్న వ్యాగన్ కు తగలటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి టైర్లుకు నిప్పంటుకుంది. వెనువెంటనే పక్కనే ఉన్న వారు విద్యుత్ సబ్ స్టేషన్ కు ఫోన్ చేయగా విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది.వెంటనే లారీ డ్రైవర్ అక్బర్, క్లీనర్ షాదులు లారీ నుంచి దూకి వేసారు. ఇద్దరుకీ గాయాలు కాగా 108 వాహనంలో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంనకు తరలించి చికిత్స అందించారు. గురువారం వేకువజామున గుమ్మ లక్ష్మిపురం నుంచి తనుకు జీడి పిక్కలు లోడ్ తీసుకుని వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. సకాలంలో సరఫరా నిలిపి వేయడంతో జీడిపిక్కలు, కానీ, లారీకి కానీ నష్టం వాటిల్లలేదు... నిప్పు అంటుకున్న టైరులు ఇసుక పోసి మంటలు ఆపివేశారు.

దివ్యాంగుల జాతీయ అవార్డు-2024 కొరకు ధరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాలో గల దివ్యాంగులకు డిశంబర్, 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు మరియు దివ్యాంగుల సాధికారత కొరకు కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు జాతీయ స్థాయి అవార్డు ప్రదానం చేయుటకు భారత ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ధరఖాస్తులు ఆహ్వానించుచున్నారని విభిన్న ప్రతిభావంతులు, హిజాలు మరియు వయోవృద్ధుల సంక్షేమశాఖ పార్వతీపురం మన్యం జిల్లా సహాయ సంచాలకులు కె. కవిత తెలిపారు. అర్హులైన దివ్యాంగులు మరియు దివ్యాంగుల సాధికారత కొరకు కృషి చేస్తున్న వ్యక్తులు మరియు సంస్థలు ఈ అవార్డు కొరకు www.awards.gov.in నందు తేది 31-7-2024 లోపల ఆన్ లైన్ ద్వారా మాత్రమే ధరఖాస్తు చేసుకోవలసినదిగా కోరారు. ఇతర వివరాల కొరకు అనగా గైడ్ లైన్స్ మరియు అప్లికేషన్ నమూనా ఇతర విధి విధానాల కొరకు %ఞఞఞ.ఎవజూఞ.ప్రశీజ.ఱఅ% వెబ్ సైట్ ను సందర్శించవలసినదిగా కోరారు.

కుక్కలదాడిలో మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని గవరమ్మపేట పంచాయతీ పరిధిలో వెంకటరాజపురం గ్రామానికి చెందిన కర్రి పోలమ్మ అనే మహిళపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. వివరాలు పరిశీలిస్తే పోలమ్మ పొలం పనులు చేస్తున్న సమయంలో కుక్కలు దాడి చేస్తే కాల్లను, తలవెనక చెవిని కొరికి వేసాయి. వెంటనే అక్కడ ఉన్న రైతులు అప్రమత్తమే వాటిని కొట్టితరలించారు. వెంటనే ఆమెను చినమారంగి ఆసుపత్రికి తరలించగా వైద్యులు సునీల్ కుమార్ చైతన్యలు చికిత్స చేశారు. రైతులు అందుబాటులో లేకపోతే ఆమెను కుక్కలు చంపివేసి ఉండేవని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం ఇదే మండలానికి చెందిన సీమ నాయుడు వలస కూడలిలో ఒక యువకుడిని కుక్కలు చంపివేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల బెడదను తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రజలంతా కోరుతున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో విపరీతంగా కుక్కలు పెరిగి ఉండడంతో ప్రజలు,మహిళలు, పిల్లలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి కుక్కల బెడదను శాశ్వతముగా లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యలు తెలుసుకుంటూ... సహాయం అందిస్తున్న కలెక్టర్

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు మండలంలోని వరద బాధితులకు ఇబ్బంది లేకుండా వెంట వెంటనే సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ యస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం చింతూరు మండలంలోని ఎజీ కోడేరు పంచాయతీలోని మల్లెతోట, ఉలుమూరు గ్రామాలలో సమస్యలు తెలుసుకుంటూ, సహాయక చర్యలు అందిస్తూ జిల్లా కలెక్టర్ పర్యటన సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరద ముంపు బాధితుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా ప్రతి మండలానికి ఐఎఎస్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. మల్లెతోట, ఉలుమూరు గ్రామంలోని వరద బాధితులకు కూరగాయలు, బియ్యం, వంటనూనెతోపాటు టార్చ్ లైట్, కొవ్వొత్తులు, పాల ప్యాకెట్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వరద బాధితులకు పంపిణీ చేయడం

జరిగింది. అదేవిధంగా వరద బాధితులతో మాట్లాడి గ్రామ సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించే విధంగా ఆదేశాలు జారీ చేసారు. విఆర్ పురం మండలం వెళ్లే రహదారి రామవరం, చొప్పెల్ల మధ్యలో రోడ్డు మీదకు వరద నీరు రావడంతో ఆ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. మల్లె తోట, ఉలుమూరు గ్రామాల ప్రజలకు పోలవరం ప్రాజెక్టు ముంపు జాబితాలో చేర్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ స్పందిస్తూ, ఈ రెండు గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కొరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. వరద పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను వెంటనే కంట్రోల్ రూమ్ లకు తెలియపరచాలని సూచించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలోని బాల బాలికలకు ఏర్పాటుచేసిన పాలు గుడ్లు తదితర పౌష్టికాహార0నకు సంబంధించిన సరుకులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట చింతూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కావూరి చైతన్య, చింతూరు ఏ ఎస్ పి రాహుల్ మీనా, తాసిల్దార్ నజీముల్లా, ఎంపీడీవో రవిబాబు, పంచాయతీ కార్యదర్శి జి. జగజ్జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : మండలంలోని అడ్డాపుశీల గ్రామ సమీపంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామిని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు పూర్ణ కుంభంతో మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కలెక్టర్‌కు తీర్థప్రసాదాలను పురోహితులు అందజేశారు. ఎ.శ్యామ్ ఈ సందర్భంగా స్వయంభూగా వెలసిన శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ విశిష్టతను, పురాతన చరిత్రను పురోహితులు కృష్ణ చంద్రశర్మ, కలెక్టర్‌కు వివరించారు.

విభిన్న ప్రతిభవంతుల సాధికారత అవార్డులకు దరఖాస్తులు

విశాలాంధ్ర-అరకులోయ : దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల నుండి జాతీయస్థాయి అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అల్లూరి జిల్లా విభిన్న ప్రతిభవంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జె మాధవి పత్రిక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ జస్టిస్, ఎంపవర్మెంట్ ఈ అవార్డులను అందజేస్తుందని ఆమె తెలియజేశారు. అర్హులు ఈనెల 31వ తేదీలోగా www.depwd.gov.in లేదా www.awards.go.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. అప్లికేషన్లు, నామినేషన్లు కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన వారికి డిసెంబర్ మూడో తేదీన అంతర్జాతీయ ఈ భిన్న ప్రతిభవంతుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రధానం చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా ట్రైబల్ డిసిబుల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు బి ధర్మ ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణితో బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన భేటీ

విశాలాంధ్ర-సాలూరు: రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, స్త్రీ శిశుసంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణిని గురువారం సచివాలయంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బొబ్బిలి నియోజకవర్గం లో ఉన్న గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను సంధ్యారాణి కి వివరించారు. గిరిజన గ్రామాలకు సురక్షిత రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించా లని కోరారు. గిరిజన సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని అభ్యర్థించారు. బొబ్బిలి నియోజకవర్గ అభివృద్ధికి, గిరిజనాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

మావోల వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల ముమ్మర తనిఖీలు

విశాలాంధ్ర-చింతపల్లి : ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు జరగనున్న మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మావోయిస్టులు ఉనికిని చాటుకునేందుకు ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో తమ కార్యకలాపాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తారన్న అనుమానంతో వారి కార్యకలాపాలను భగ్నం చేసేందుకు, వారి వలన ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గురువారం పెద్దగెడ్డ సమీపంలో పోలీసు బలగాలు, బాంబు, డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు చేపట్టారు. ఇదే క్రమంలో వాహనాలను తనిఖీ చేసి, అనుమానితులను ప్రశ్నించి వదిలిపెడుతున్నారు.

చక చకా శానిటేషన్ పనులు

విశాలాంధ్ర-కూనవరం : వరద తీసిన వెంటనే ఊరంతా బురద వాసన రాకుండా కూనవరం మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ చక చక శానిటేషన్ పనులు చేయిస్తున్నారు. రహదారులు వీధుల్లో బ్లీచింగ్ చల్లించి చెత్త తీయిస్తున్నారు. దుర్వాసనకు వ్యాధులు ప్రబలకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగుతాయని అన్నారు.

నేడువీరఘట్టం ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-వీరఘట్టం : నేడు అనగా శుక్రవారం వీరఘట్టం టౌన్ నందు ట్రాన్స్ఫార్మర్ నిర్వహణ మరియు చెట్లు తొలగించుట, ఇతర పనులనిమిత్తం, వీరఘట్టం టౌన్ పరిధిలో పనులు చేయుట వలన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును.కావున వీరఘట్టం టౌన్ పరిధిలో విద్యుత్ అంతరాయము కలుగును. అని విద్యుత్ శాఖ అధికారి టీజికె మూర్తి తెలిపారు.

మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి వితరణ

విశాలాంధ్ర-కురుపాం : విశాఖకు చెందిన మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి యాజమాన్యం కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లక్ష రూపాయల విలువైన కంప్యూటర్ ఇతర సామగ్రి విరాళంగా అందజేశారు. గురువారం మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రిలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి. మురళీకృష్ణ ప్రధానోపాధ్యాయులు తోట శంకర రావు కి లాప్ టాప్ , ప్రింటర్ మరియు ఇన్వెర్టర్ అందజేశారు. కురుపాం గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకున్న మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి గతంలో మెడికల్ కాంపులు నిర్వహించారు. డాక్టర్ మురళీకృష్ణ తండ్రి డాక్టర్ వూన్న సీతారమస్వామి కురుపాం పాఠశాల పూర్వ విద్యార్థి. ఈ కార్యక్రమంలో విశాఖ ఈస్ట్ క్రైమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సొండి ఆదాం, కురుపాం పాఠశాల దాతల కమిటీ అధ్యక్షుడు బెహరా దివాకర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పల్ల సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

ఐటిఐలో మిగులు సీట్ల కొరకు రేపే కౌన్సిలింగ్

విశాలాంధ్ర-సాలూరు: సాలూరు లో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో మిగిలిఉన్న సీట్లకు శనివారం కౌన్సిలింగ్ జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 27 వ తేదీన ఉదయం 9 గంటలకు ఐటిఐ కళాశాల ఆవరణలో మిగిలి ఉన్న సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తునట్లు గురువారం ఆయన తెలియజేశారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ వెహికల్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్ మరియు కోపా(కంప్యూటర్) కోర్సులకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసి వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు వారి ఒరిజినల్ ధృవీకరణ పత్రాలను తీసుకొని హాజరుకావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా పదవతరగతి మార్క్‌లిస్ట్, టిసి, కులధృవీకరణ పత్రము, స్టడీ సర్టిఫికేట్ తీసుకొని రావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి 2173 క్యూసెక్కుల నీటి విడుదల

విశాలాంధ్ర-సీలేరు... సీలేరు కాంప్లెక్స్‌లో డొంకరాయి జలాశయం నుంచి 2173 క్యూసెక్కుల నీటిని దిగువకు జెన్‌కో అధికార్లు విడుదల చేశారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండంతో డొంకరాయి జలాశయంకు ఎగువన ఉన్న పలసగెడ్డ, పాలగెడ్డ వాగుల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరింది. 8వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ రావడంతో బుధవారం ఉదయం నాటికి 1035 అడుగులకు శరవేగంగా పెరగడంతో వెంటనే జెన్‌కో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే జలాశయం దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం అర్ధరాత్రికి డొంకరాయి జలాశయం 1038 అడుగులకు పెరగడంతో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ విజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో జలాశయం 6వ నెంబరు గేటు రెండు అడుగుల ఎత్తి 2173 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ముడుపుల పూజలకు పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర-సీతానగరం : మండలకేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలోగల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం జరిగిన ముడుపుల పూజలకు వివిధ ప్రాంతాలనుంచి పెద్దఎత్తున భక్తులువచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తెల్లవారుజామున మూడుగంటలనుండి రాత్రివరకు బ్యాచుల వారీగా శ్రీలక్ష్మీ నరసింహస్వామివారికి ఆలయప్రదాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, పీసపాటి రామానుజాచార్యులు, ఆమంచి శ్రీనివాసాచార్యులు, కె.మురారి, బృందావనం ఉదయ కృష్ణమాచార్యులు, పవణ్ కళ్యాణ్ ఆచార్యులు, మనోజ్ వంశీ కృష్ణమాచార్యుల అధ్వర్యంలో పూజలను దగ్గరుండి చేయించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ముడుపుల పూజలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులు తెచ్చిన రకరకాల పూలతోను పూలదండలతోనూ స్వామివారిని అలంకరించిన తీరు అందరిని ఆకట్టుకుంది. పూజలు పూర్తయ్యాక స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరలివెళ్లారు.

విద్యుత్ తీగలపై కూలిన భారీ వృక్షం

విశాలాంధ్ర-సీలేరు... సీలేరులో వర్షాలకు భారీ వృక్షం విద్యుత్ తీగలపై పడింది. స్థానిక జెన్‌కో కాలనీలోని 3వ క్రాస్ రోడ్డులో మధ్యాహ్నం సమయంలో భారీ చెట్టు విద్యుత్ సరఫరా ఉన్న తీగలపై పడటంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో వర్షం కురుస్తుండంతో పాటు పక్కనే ఉన్న ఇంట్లో వాళ్లు ఆ సమయంలో ఎవరూ బయట కేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. చెట్టు విద్యుత్ తీగలపై పడిపోయిందన్న సమాచారం తెలుసుకున్న జెన్‌కో డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రదేశానికి చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేసి చెట్టు నరికించి మూడు గంటల పాటు శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

అంతరాష్ట్ర బస్ కాంప్లెక్స్‌లో కనీసం మౌలిక వసతులు కల్పించండి

కోఫోకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్స్ట్రక్టర్ పాండురాజు

విశాలాంధ్ర-చింతపల్లి : అంతర్రాష్ట్ర బస్ కాంప్లెక్స్ లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని కరాటే అసోసియేషన్ స్టూడెంట్స్ కోఫూకాన్ కరాటే క్లబ్ చీఫ్.ఇన్ స్ట్రక్టర్ ఎగ్జామినార్ బాకూరు పాండురాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి ముఖ కేంద్రం నుండి ఒడిస్సా, తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించి నిత్యం రాకపోకలు సాధించే ప్రయాణికులున్నా, వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించవలసిన అంతర్రాష్ట్ర బస్ కాంప్లెక్స్‌గా పేరుందిన చింతపల్లి బస్ కాంప్లెక్స్‌లో నేడు కనీసం మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు చదువుకునే విద్యార్థిని, విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల,, ఐటిఐ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు రాత్రి సమయం వరకు కూడా ఈ కాంప్లెక్స్ లో ఆర్టీసీ సర్వీసుల కోసం వేచి చూస్తున్న సందర్భాలు లేకపోలేదు. ప్రయాణికుల సౌకర్యార్థం కాంప్లెక్స్ లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే, మరోపక్క ఆకతాయిలు వల్ల కూడా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. బస్ కాంప్లెక్స్ లో వసతులతోపాటు కాంప్లెక్స్ ఆవరణలో పూర్తి స్థాయిలో నిఘ (సీసీ) కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

సాగునీరు విడుదలకు సన్నాహాలు

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా ముక్క మండలంలో, వెంగలరాయ జలాశయం నుండి ఆయుకట్టుదారులకు సాగునీరు ఈ నెల 31వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన శాఖా మంత్రి మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతులమీదుగా విడుదల చేయడానికి ముహూర్తం నిర్ణయించిన నేపథ్యంలో ప్రాజెక్టు స్థితి, గతులు, ప్రాజెక్టులో నీటి నిల్వలు మరియు స్థల పరిశీలన నిమిత్తం మక్కువ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు ఆద్వర్యంలో జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజాన అప్పలనాయుడు సమక్షంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ద్వారపురెడ్డి సురేష్ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొని సాగు నీరు విడుదలకు కావాల్సిన సన్నాహాలు గూర్చి చర్చించడం జరిగినది. ఈ సాగు నీటి విడుదల కార్యక్రమానికి మక్కువ మండల అన్నీ పంచాయతీల రైతులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించండి : జేసి డా.అభిషేక్

విశాలాంధ్ర-ఎటపాక : వరద ముంపు గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జే. అభిషేక్ గౌడ్ ఆదేశించారు. గురువారం ఎటపాక మండలంలోని టిపి వీడు, నెల్లిపాక, గన్నవరం గ్రామాలలోని వరద ముంపు బాధితుల పునరావాసం కేంద్రాలు పరిశీలించి నిత్యావసర వస్తువులు సక్రమంగా అందినదీ లేనిది ఆరా తీశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితుల పునరావాస కేంద్రాల్ల, ఆయా గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని, అంటువ్యాధులు ప్రభాలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వరదల సమయంలో నదీ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పునరవాస కేంద్రాలలోని ఆయా గ్రామాలలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జేసి సూచించారు. గన్నవరం గ్రామంలోని వరద బాధితులకు సహాయం అందించాలని ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ, టీడీపి సీనియర్ నాయకులు బొల్ల పుల్లయ్య,, ఎంపిటీసీ రాజు జేసీ ని కోరారు. ఈ పర్యటనలో తాసిల్దార్ శేఖర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-సాలూరు : పట్టణ పోలీస్‌స్టేషన్‌ని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను సిఐ వాసునాయుడిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. రాత్రి సమయాలలో గస్తీ పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ సురేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి పాటుపడుతున్న మంత్రిపై విమర్శలు సరికావు

గిరిజన సంఘాల నాయకులు తీరు మార్చుకోవాలి
నియోజక వర్గఎస్టీ సెల్ అధ్యక్షుడు కోట.లక్ష్మణ

విశాలాంధ్ర-సాలూరు: గిరిజనాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న గిరిజనసంక్షేమ శాఖామంత్రి సంధ్యారాణిపై గిరిజన సంఘాల వారు తప్పుడు విమర్శలు చేయడం సరికాదని నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కోట లక్ష్మణరావు అన్నారు. గురువారం సాలూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలలో గిరిజనులకు కాకుండా గిరిజనేతరులను ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్‌కుమార్ విమర్శించడం సరికాదన్నారు. గిరిజన సంఘాల వారు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. ప్రతీ సంస్థలో రిజర్వేషన్ ప్రాతిపదికన అన్నికులాల వారికి అవకాశం ఉంటుందన్నారు. అందులో భాగంగా ఒకటి లేకా రెండు ఉద్యోగాలు గిరిజనేతరులు పొందితే వాటిని వక్రీకరించి చూపడం సమంజసం కాదన్నారు. ఏకలవ్య పాఠశాలలకు రెగ్యులర్ ఉద్యోగులు రాకతో ఉపాధి కోల్పోయిన వారందరకీ ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వం పై దుష్ప్రచారం తగదన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తక్కువ సమయంలోనే మన్యం జిల్లాను ప్రగతిపథం లో నడిపిస్తున్న మంత్రి పై తప్పుడు ఆరోపణలు చేయవద్దన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎమ్ లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు కంచాలు, దుప్పట్లు, పెట్టెలను అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు.

గిరిజనులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు మంత్రిగా సంధ్యారాణి చూపిస్తున్న చొరవ చూపడంతో పాటు సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారన్నారు. అటువంటి నాయకురాలిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేదిలేదని గిరిజన సంఘాలను హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గిరిజన నాయకులు దొర.లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

సిజేరియన్ ఆపరేషన్ విజయవంతం

విశాలాంధ్ర-కూనవరం : కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గురువారం స్పెషలిస్టు వైద్యులు ఓ గర్భిణీకి విజయవంతంగా సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి.గోదావరి వరదలు రావడంతో ముందస్తుగానే ఈ ప్రాంతంలోని గర్భిణీలను కోతులగుట్ట సీ హెచ్ సీ కి తరలించారు. ఈ క్రమంలో కూనవరం ఉదయభాస్కర్ కాలనీకి చెందిన బర్ల శ్రావణీ అనే గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో వైద్యులు ఆమెకు సిజేరియన్ చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. భద్రాచలం గానీ చింతూరు, రంపచోడవరం ఆసుపత్రులకు పంపించాలన్నా చుట్టు రహదారులపై వరదనీరు ఉండడంతో కూనవరం సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ మహేష్‌బాబు, కూనవరం గైనకాలజిస్టు డా. పి.శ్వేత, రంపచోడవరం ఎనస్థీషియా వైద్యాధికారులు డా.పద్మావతి సీనియర్ వైద్యులు డా. టీవీ శేషిరెడ్డి లు సిజేరియన్ ఆపరేషన్ ను నిర్వహించారు. సిజేరియన్ ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని, తల్లి, మగబిడ్డ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె.మహేశ్ బాబు తెలిపారు. కాగా కూనవరం ప్రభుత్వ ఆసుపత్రులో మొదటిగా నిర్వహించిన ఆపరేషన్ విజయవంతం కావడంతో వైద్యాధికారులు వైద్య సిబ్బంది ఆనందం వ్యక్తం చేసారు. వరదల సమయంలో గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా కలెక్టర్, డీసీహెచ్ఎస్ స్పెషలిస్టు డాక్టర్ లను పంపిండంతో ఈ ఆపరేషన్ విజయవంతంగా చేయడం జరిగింది. ఇప్పటి వరకు భద్రాచలం, చింతూరు, రంపచోడవరం ఏరియా ఆసుపత్రులలో మాత్రమే సీజేరియన్ ఆపరేషన్ లు జరిగేవి. ఇకపై కూనవరం సీ హెచ్ సీలో కూడా అందుబాటులో కి రాడంతో ఈ ప్రాంత ప్రజలకు మేలు జరగనుంది. ఈ ఆపరేషన్ లో హెడ్ నర్స్ బి.బొజ్జి, స్టాఫ్ నర్స్ కె. పలీనా, వై.అనసూర్య, సిబ్బంది సుబ్బయ్య, జీవన్ , అఖిల్ తదితరులున్నారు.

దోబూతులాడుతున్న గోదావరి, శబరి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : శబరి గోదావరి నదులు పొంగి ప్రవహిస్తూ కాస్త తగ్గుముఖం పట్టాయని ఊరట చెందుతున్న ప్రజలకు మరల గోదావరి పెరుగుతుందని తెలుసుకున్న ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం వద్ద హు గోదావరి నీటిమట్టం 41 అడుగులకు చేరి మరల 49 అడుగులకు పెరగటంతో ఎంతవరకు గోదావరి పెరుగుతుందోనని భయం చోటు చేసుకుంటుంది. ఇప్పటివరకు మండల కేంద్రానికి రావాలన్న చింతరేగుపల్లి సున్నవారిగూడెం , అడవి వెంకన్న గూడెం, శ్రీరామగిరి సీతంపేట పోచవరం తదితర గ్రామాల ప్రజలు బోటు ద్వారా ప్రయాణించి రావాల్సిన పరిస్థితి నెలకొంది. చింతూరు మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. శబరి గోదావరి నదుల వరద ప్రవాహం దోబూచులాడు తుండ డడంతో ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సిల్వర్ మొక్కలతో ఆర్థిక అభివృద్ధి

ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మూర్తి

విశాలాంధ్ర-హుకుంపేట : గిరిజన రైతులు వారి పొలాల వద్ద కొండ గరువుల వద్ద మొక్కలు నాటి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో మూర్తి,ఈసీ శంకర రావులు పేర్కొన్నారు. గురువారం బారమోసీ పంచాయతీలో నీలంపు ట్టు, బారాపల్లి, బారమెసీ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 12 ఎకరాలకు రైతులకు సిల్వర్ మొక్క ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని రైతులకు మొక్కలు అందిం చారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అడవి సంరక్షణా అభివృద్ధితో పాటు భూగర్భజలాలు కాపాడుకోవాలని ఆయస కోరారు. బారామోసీ పంచాయతీలో మొత్తం 43 ఎకరాల కు గుర్తించి అక్కడ సిల్వర్ మొక్కలు పెంచాలని ప్రతి పాధనలు పంపించా మని మొదటి విడతగా 12 ఎకరాల కు మొక్కలు వచ్చాయని రెండో విడత ద్వార మొత్తం 31ఎకరాలకు మొక్కలు అందిస్తామని తెలిపారు. ప్రతి రైతు ఈ మొక్కల్ని వృధగా వదిలేయకుండా నాటాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచు రామాదే వి, ఎస్ఆర్టీఎస్ సిబ్బంది అర్జున్, రాంబాబు, రాపస్వామి తదితరు లు పాల్గొన్నారు.

గన్నవరాన్ని పోలవరం ముంపులో చేర్చాలని జేసీకీ వినతి

విశాలాంధ్ర-ఎటపాక : గన్నవరాన్ని పోలవరం ముంపులో చేర్చి జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కీ ఎటపాక మండలం గన్నవరం ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ, వినతి అందించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లడుతూ ప్రతి మా గన్నవరం పంచాయితీ 40 అడుగుల గోదావరి వరదలకే మాగ్రామం ముంపునకు గురవుతున్నాయి. ప్రతిఏటా వలస వెళ్లి పునరావాసానికి మళ్ళీ మగ్రా మానికి చేరడం చాలా ఇబ్బందులు పడుతున్నామని, ముంపునకు గురయ్యే వారికి సురక్షిత ప్రాంతానికి తరలించి వారికి శాశ్వత ఇల్లు నిర్మించాలన్నారు. లేదంటే పంచాయితీ నీ 41 కాంటూరు లో చేర్చి పోలవరం పరిహారం, భూ ప్యాకేజి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గద్దం భద్రమ్మ, ఎంపిటీసీ రాజు, టీడీపి సినియర్ నాయకులు బొల్ల పుల్లయ్య తదితరులు పాల్గోన్నారు.